క్లుప్తంగా

స్వచ్ఛ సమాజాన్ని నిర్మిద్దాం



నూజెండ్ల: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచగలిగినప్పుడే జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న స్వచ్ఛ సమాజాన్ని నిర్మించుకోగలమని మండల అభివృద్ధి అధికారి పి.ఉమాదేవి అన్నారు. మండలంలోని తలార్లపల్లి, చింతలచెరువు, తదితర గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా రహదారుల వెంట చెత్త దిబ్బలను తొలగించి అదే ప్రదేశంలో నీడనిచ్చే చెట్లను నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ సెక్రటరీలను ఎంపీడీఓ ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, సర్పంచ్ తులసారావు, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల ధ్వంసంపై ఫిర్యాదు

నాదెండ్ల: తన పొలంలో నాటిన 550 మహోగని మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు పీకేశారంటూ నాదెండ్ల గ్రామానికి చెందిన పర్చూరి బలరామయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు నాదెండ్ల గ్రామంలోని సర్వే నెం.507,508 చలమకొండల ప్రాంతంలో 1.25 ఎకరాల భూమి ఉందని, నెల రోజుల క్రితం ఈ భూమిలో 550 మహోగని మొక్కలు నాటానన్నారు. ఈ నెల 20న గుర్తుతెలియనవ్యక్తులు మొక్కలన్నీ పీకి కుప్పగా వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్ఐ జి.పుల్లారావు భూమిని పరిశీలించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుమారు 35–40 సంవత్సరాల వయసు గల ఓ వ్యక్తి 16వ నంబర్ జాతీయ రహదారిపై చిలకలూరిపేట నుంచి మార్టూరు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈనెల 13న జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియన పాదాచారుడ్ని స్థానికులు గమనించి 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న వాహన సిబ్బంది ప్రాథమిక చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలూరిపేట రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సెల్ నెంబర్ 94409 00880కు సమాచారం ఇవ్వాల్సిందిగా పోలీసులు కోరారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చిలకలూరిపేట: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో స్వస్థ్ నారీ–స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. దీంతో పాటు రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో మహిళలకు గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించటం అభినందనీయమన్నారు. వీటితో పాటు ఇతర పరీక్షలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్ భవాని, డాక్టర్ ఎం ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు

బొల్లాపల్లి: మండలంలోని సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ. పి.ఆర్ ఏఈ శేష అప్పయ్య మంగళవారం తెలిపారు. మండలంలోని రావులాపురం, రేమిడిచర్ల గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని, మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు పనిచేస్తాయని చెప్పారు.

121 మందికి అన్నదానం

సత్తెనపల్లి: పట్టణంలోని మస్తాన్‌పేటలో జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి ఆధ్వర్యంలో న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు దాతల సహకారంతో మంగళవారం 121 మందికి అన్నసంతర్పణ చేశారు. అన్నం మల్లికార్జునరావు తిథి సందర్భంగా వారి పెద్ద కుమారుడు అన్నం కృష్ణమూర్తి, విజయదుర్గ అన్నసంతర్పణలో భాగస్వాములయ్యారు.

గాయత్రీదేవి నమస్తుభ్యం!



నాదెండ్ల శాంతినగర్‌లో..



రాంనగర్ కోదండ రామాలయంలో..



శావల్యాపురంలో గాయత్రీదేవి అలంకరణ



విప్పర్లలో గాయత్రీ మాత అలంకరణలో..



రొంపిచర్లలో కౌమారి అలంకరణలో ..



నరసరావుపేటలో మహేశ్వరీ అలంకరణలో..



నీలంపాటి అమ్మవారి సన్నిధిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పాలపాడురోడ్డు ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



వద్దేంగుంటలో గాయత్రీ దేవిగా...



చిలకలూరిపేటలో రాజ్యలక్ష్మీ దేవి అలంకారంలో ...

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం రెండో రోజు పలు ఆలయాల్లో అమ్మవారు వేద మాత గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించగా భక్తులు భారీగా హాజరయ్యారు. పలు ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– నాదెండ్ల/ శావల్యాపురం/రొంపిచర్ల/నరసరావుపేట ఈస్ట్/చిలకలూరిపేట/బొల్లాపల్లి

‘యూటీఎఫ్ రణభేరి’ జయప్రదం చేయండి

వినుకొండ: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ సెప్టెంబరు 15 నుంచి 19 వరకు నిర్వహించిన రణభేరి జాతా ముగింపు సందర్భంగా ఈ నెల 25న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్రస్థాయి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా యూటీఎఫ్ కోశాధికారి ఎం.రవిబాబు తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రణభేరి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల విద్య, ఆర్థిక సమస్యలపై నిర్వహించిన రణభేరి జాతాలకు ఉపాధ్యాయుల నుండి అనూహ్య స్పందన వచ్చిందని అపూర్వ స్వాగతం పలికారన్నారు. రణభేరి సభకు 26 జిల్లాల నుండి ఉపాధ్యాయుల పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు,విద్యారంగ విధానాలపై, బోధనేతర కార్యక్రమాలపై అసంతృప్తితో ఉన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా డీఏ గాని, ఐఆర్ గాని ఇవ్వలేదన్నారు. రణభేరి సభలో జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ డీవీ లింగయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పీఏ జిలాని, సీహెచ్ మల్లికార్జునరావు, బి.నాగేశ్వరరావు, డి. మస్తాన్, జి.ప్రసాద్, బి.రామనాయక్, సీహెచ్ తిరుపతిరెడ్డి, యు.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగారావుపాలెంలో ‘స్వస్థ్ నారీ సశక్తి పరివార్’



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం గ్రామంలోని సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు ఉచితంగా వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఐటీసీ ఎమ్మెస్కే–అసిస్ట్ వారి సహకారంతో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ కరీమూన్, యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ, సీహెచ్ఓ పున్నారావు, భారతి, రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు హాజరయ్యారు.

జేఎన్‌టీయూఎన్‌లో అట్టహాసంగా ‘టెక్ టుడే’



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం టెక్ టుడేను అట్టహాసంగా నిర్వహించారు. కళాశాల ఈసీఈ విభాగం, ఐఈటీఈ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్ టుడ్ –25 కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ విభాగాల నుంచి 243మంది విద్యార్థులు వివిధ ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో ఆన్‌ఐఓటీ, పేపర్ ప్రెజెంటేషన్, సర్క్యూట్ కార్నివాల్ వంటి టెక్నికల్ ఈవెంట్స్‌తో పాటు ఈ–స్పోర్ట్స్ వంటి వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక ప్రొఫెషనల్ సొసైటీ సభ్యుడిగా ఉండటం ద్వారా అనేక ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. ఐఈటీఈ చైర్‌పర్సన్ డాక్టర్ ఎ.గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, ఐఈటీఈ కో–ఆర్డినేటర్ ఎ.రాధ, ఐఈటీఈ స్టూడెంట్ వైస్‌చైర్మన్ లలిత, కార్యదర్శి అను తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ ఎరువులు అందజేయాలి



ఏఓ రామారావుతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు

శావల్యాపురం: ఖరీఫ్ సీజను వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని రైతులకు పార్టీలకతీతంగా పారదర్శకంగా అన్ని రకాల ఎరువులు పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) కోరారు. మంగళవారం స్థానిక మన గ్రోమార్ సెంటరులో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావును కలిశారు. ఈసందర్భంగా కొండలు మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సొసైటీలు, మన గ్రోమార్ సెంటర్లలో యూరియా, డీఏపీ కోసం పడిగాపులు కాయకుండా వ్యవసాయ అధికారులు పర్యవేక్షణలో రైతులందరికీ అందేలా చూడాలన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు పొట్టిపాటి శ్రీనివాసరావు, తిరివీధి రమణారావు, బొల్లా సుబ్బారావు, బోడెపూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



పెదమక్కెనలో మాట్లాడుతున్న 104 రీజనల్ మేనేజర్ ఖలీం

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని 104 రీజనల్ మేనేజర్ ఖలీం అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదమక్కెన గ్రామంలో 104 వాహనం ద్వారా ప్రజలకు మంగళవారం వైద్య సేవలు అందిస్తుండగా ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఖలీం మాట్లాడుతూ ప్రజలకు 104 ద్వారా లభించే అన్ని రకాల వైద్య సేవలను పటిష్టంగా అమలయ్యే విధంగా చూడాలన్నారు. అందులో భాగంగా 104 వాహనంలో డీఈవో విధులను ఆయన నిర్వహించి డేటా ఎంట్రీ ఆపరేటర్ పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని సలహాలు, సూచనలు ఇచ్చారు. దీని ద్వారా అందించే అన్ని రకాల వైద్య సేవలు ఉచితమని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత, 104 జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ వై.దావీద్, డీఈవో కె.సుధాకర్, డ్రైవర్ కోటేశ్వరరావు, ఏఎన్ఎం కె.భాగ్యలక్ష్మి, సీహెచ్ఓ రత్నప్రభ, ఆశా వర్కర్లు పద్మ, మరియమ్మ, తదితరులు ఉన్నారు.

బోడిపాలెం తండాలో ‘ఎక్సైజ్’ తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలోని బోడిపాలెం తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎక్సైజ్ అధికారి కె.మణికంఠ ఆదేశాల మేరకు నాటు సారాయి అనుమానిత ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు చేశామని తెలిపారు. నాటు సారా, కల్తీ మద్యం సమాచారం ఉంటే ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని చెప్పారు. తనిఖీల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్సైలు కె.శ్రీనివాసరావు, సిహెచ్ వినీల, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం కొంకెరు వాగు వంతెన జాతీయ రహదారి మార్గంలో రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు యువకులకు గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కొండవీటి మోహనకృష్ణ, పీసపాటి హరికృష్ణ, శ్రీను శ్రీశైలంలో మల్లన్న దర్శనం చేసుకొని స్వగ్రామం వెళుతున్నారు. శావల్యాపురం గ్రామానికి చెందిన బోయలపల్లి ఆమోసు బైకుపై వినుకొండ వెళుతుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న బుల్లెట్‌ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో బుల్లెట్‌పై ప్రయాణం చేస్తున్న ఇరువురు వ్యక్తులతో పాటు ఆమోసుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. ఈప్రమాదంలో రెండు బైకులు పూర్తిస్థాయిలో నుజ్జునుజ్జయ్యాయి. సంఘటన స్థలాన్ని రైటరు షేక్ బాషా, పోలీసు సిబ్బంది పరిశీలించి కేసు నమోదు చేశారు.

యడ్లపాడులో ‘పొలం పిలుస్తోంది’



రైతులతో కలిసి పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ హరిప్రసాద్

యడ్లపాడు: స్థానిక రైతుసేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ స్థానిక రైతులతో కలిసి గ్రామంలోని పత్తి పొలాలను సందర్శించి రైతులకు నేరుగా తగు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే బ్లాక్ బర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వ నిషేధం గురించి వివరంగా వివరించారు. ప్రస్తుతం ప్రత్తి పంట కాయ దశలో ఉన్నందున, ఈ దశలో గులాబీ రంగు పురుగు ఆశించడం వల్ల అధిక నష్టం జరుగుతుందని ఏఓ హెచ్చరించారు. గులాబీ పురుగు ఉధృతిని నివారించడానికి రైతులు తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా వివరించారు. పొలంలో తిరుగుతూ గుడ్డి పువ్వులు ఎక్కడైనా కనిపిస్తే, వాటిని వెంటనే ఏరివేసి పొలానికి దూరంగా కాల్చివేయాలయి, పది కాయలు కోసి, అందులో గులాబీ రంగు పురుగు ఉనికిని పరిశీలించాలన్నారు. గులాబీ రంగు పురుగు ఉధృతి గమనించినా లేదా లింగాకర్షణ బుట్టలో వరుసగా ఎనిమిది రెక్కల పురుగులు పడినట్లయితే వెంటనే తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం బ్లాక్ బర్లీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించిందని స్పష్టం చేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఎవరూ పొగాకు సాగు చేయవద్దని సూచించారు.

అమీన్‌సాహెబ్‌పాలెంలో...

నాదెండ్ల: రైతులు తాము సాగు చేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి టి.శ్రీలత చెప్పారు. అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిలో గులాబీరంగు పురుగు నివారణ, మిరప, జొన్న, సజ్జ పంటలకు సంబంధించి సస్యరక్షణ చర్యలు వివరించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బైక్ చోరీ

నరసరావుపేట టౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో ద్విచక్ర వాహనం అపహరణకు గురైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ మంగళవారం తెలిపారు.
మండలంలోని ఇస్సప్పాలెం గ్రామానికి చెందిన రావుడ్ల శ్రావణ్‌కుమార్ నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో అవుట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తన ద్విచక్రవాహనం పార్క్ చేసి డ్యూటీకి వెళ్లాడు. డ్యూటీ ముగించుకొని తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల విచారించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువత, విద్యార్థుల సమస్యలపై పోరాడాలి

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి వేణుమాధవ్‌కు సూచించిన డాక్టర్ గోపిరెడ్డి



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన వేణుమాధవ్, నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలోని యువజనులు, విద్యార్థులు అందరూ తమ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉప్పుతోళ్ల వేణుమాధవ్ మంగళవారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి దుశ్శాలువ కప్పి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. వేణుమాధవ్‌ను సైతం డాక్టర్ గోపిరెడ్డి సన్మానించారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు అచ్చిశివకోటి, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, బీసీ విభాగ పట్టణ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, ఎస్‌సీ సెల్ పట్టణ కార్యదర్శి కుక్కల పోలయ్య, నాయకులు గంటినపాటి గాబ్రియేలు, పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోగులపాడులో ‘మహా పోషణ్’



పోషకాహారాలను పరిశీలిస్తున్న సీడీపీఓ కాంతకుమారి, డాక్టర్ సాయిబాబా

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మహా పోషణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ ఎస్.కాంతకుమారి హాజరయ్యారు. అంగన్‌వాడీలు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిరు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సాయిబాబా పాల్గొని చిన్న పిల్లల ఆరోగ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. మంచి వంటకాలకు బహుమతులు అందజేశారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బొల్లాపల్లి: మండలంలోని మేళ్ల వాగు అంగన్‌వాడీ మెయిన్ సెంటర్ వద్ద పోషణ్ మహా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్ట్ సీడీపీఓ ఇ.వాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందజేస్తున్న ఆహార పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంటల ప్రదర్శన, బాలామృతం ప్రాధాన్యత, డీఐవై బొమ్మల తయారీ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ మస్తాన్ బీ, అంగన్ వాడీ కార్యకర్తలు, గర్భిణులు బాలింతలు, కిశోర బాలికలు చిన్నారులు పాల్గొన్నారు.

60 ఎంటీల యూరియా రాక

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, శానంపూడి, మతుకుమల్లి, పిచికలపాలెం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలకు 60 మెట్రిక్ టన్నులు యూరియా సంచులు వచ్చినట్లు ఏఓ రామినేని రామారావు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ అన్ని రకాల ఎరువులు ఖరీఫ్, రబీ సీజనులో నిరంతరం రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మన గ్రోమార్ సెంటరుకు 35 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు వచ్చినట్లు తెలిపారు. అనంతరం గ్రోమార్ సెంటరులో రైతులకు యూరియా సంచులు పంపిణీ చేశారు. మన గ్రోమార్ సెంటరు మేనేజరు సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.